క్లుప్తంగా

సచివాలయంలో ఆధార్ సేవలు



దిమిలి సచివాలయంలో ఆధార్ సేవలు దృశ్యం

రాంబిల్లి : గ్రామ సచివాలయాల్లో అందిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఆధార్ సేవల కోఆర్డినేటర్ పి. శ్రీను కోరారు. దిమిలి సచివాలయంలో ఆయన ఆధార్ సేవలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.రాజుబాబు, వలంటీర్ రాము పాల్గొన్నారు.

ఓటరు సర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ వినయ్

మునగపాక : ఓటరు సర్వే పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ వినయ్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. సవరణలు, చేర్పులు, మార్పులు, కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు బాధ్యతగా పనిచేసి 25లోగా ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మొల్లేటి వినోద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం



వాడ్రాపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వాడ్రాపల్లి పంచాయతీ కార్యదర్శి వుప్పల శ్రీదేవి మృతి బాధాకరమని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ శ్రీదేవి మృతి చెందిన విషయం తెలిసిందే. సచివాలయం వద్ద బుధవారం శ్రీదేవి సంతాప సభ నిర్వహించారు. నూకరాజు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిగా శ్రీదేవి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆమె మృతి గ్రామానికి తీరనిలోటన్నారు. సచివాలయ కన్వీనర్ రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, జోగినాయుడు, కాండ్రేగుల లక్ష్మణరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

84 మందికి ఉచిత కంటి పరీక్షలు



శస్త్ర చికిత్సకు బయలుదేరుతున్న రోగులు

మునగపాక : నాగులాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జిల సంయుక్త నిర్వహణలో ఈ శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు చందన ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. 84 మంది రోగులు శిబిరానికి హాజరుకాగా 21మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారిని బస్సులో శంకర్ ఫౌండేషన్‌కు తరలించినట్టు క్యాంపు కో-ఆర్డినేటర్ సీహెచ్ అశ్వనికుమార్ తెలిపారు. ఉప సర్పంచ్ దానకృష్ణ, రాజునాయుడు, యల్లపు వెంకటప్పారావు పాల్గొన్నారు.

అర్హత కలిగిన అందరికీ కొత్త పింఛన్ల మంజూరు

యలమంచిలి : మండలంలో 10 సచివాలయాలకు సంబంధించిన గ్రామ పంచాయతీల్లో 76 పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆయన మండలంలో లైనుకొత్తూరు, రేగుపాలెం తదితర గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి సంబంధించిన అర్హత కలిగిన డాక్యుమెంట్‌లు స్వీకరించి విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా దరఖాస్తులు చేసుకున్న 76 మంది లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లోకి వచ్చాయా అని ఆరా తీశారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుకు పింఛను మంజూరు చేయడం జరుగుతుందని, దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు.

జయహో చంద్రయాన్

- ప్రయోగం విజయవంతం పట్ల విద్యార్థుల హర్షాతిరేకాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని భవానీ నికేతన్ విద్యార్థులు బుధవారం జయహో చంద్రయాన్ అంటూ స్టాండింగ్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు త్రివర్ణ పతాకం చేత పట్టి, పిరమిడ్ విన్యాసాలు నిర్వహించారు. టీచర్ వరలక్ష్మి , ప్రిన్సిపాల్ శ్రీను, రామ్‌కుమార్, రాధారాణి, సతీష్,నాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి : చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో మండల వ్యాప్తంగా సంబరాలు జరిగాయి. విద్యార్థులు, యువకులు, విద్యావంతులతో పాటు సామాన్యులు సైతం ఆనందం వ్యక్తం చేశారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ 3 ప్రయోగంను విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ వర్మ వీక్షించారు. పలుచోట్ల బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మునగపాక : చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావాలని ఆశించిన వారి నెలవేరింది. బుధవారం సాయంత్రం శాస్త్రవేత్తలు చేసిన కృషి విజయవంతం కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాటిపల్లి మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి నేతృత్వంలో విద్యార్థులకు ల్యాప్‌టాప్ ద్వారా చంద్రయాన్–3 ప్రయోగం వీక్షించేలా ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వేయికళ్లతో ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇదే స్కూల్లో 8వ తరగతి చదువుకుంటున్న బద్రీనాథ్ తయారు చేసిన రాకెట్ అందరినీ ఆకట్టుకుంది. చంద్రయాన్ -3 ప్రయోగానికి సంబంధించి విద్యార్థులకు బద్రీనాథ్ అవగాహన కల్పించారు.



త్రివర్ణ పతాకాలతో జయహో చంద్రయాన్ అంటూ విద్యార్థుల హర్షాతిరేకాలు



ఆకట్టుకున్న 8వ తరగతి విద్యార్థి తయారు చేసిన రాకెట్ నమూనా



రాంబిల్లి ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ 3 ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాడీవేడిగా మండల సమావేశం

- సాగునీటి కాల్వలు, విద్యుత్ సమస్యలపై గళమెత్తిన సభ్యులు
- అధికారుల పనితీరుపై అసంతృప్తి
- అరకొరగా కొత్త పింఛన్ల మంజూరుపై ఆగ్రహం

యలమంచిలి : మండలంలో ఒక్క గంజాయి కేసు అయిన సెబ్ అధికారులు నమోదు చేశారా అని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. బుధవారం సాయంత్రం జరిగిన యలమంచిలి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ముందుగా ఎంపీడీవో అప్పలనాయుడు అజెండాలో పొందుపరిచిన అంశాలు చదివి సభ్యులకు వినిపించారు. వైస్ ఎంపీపీ రాజాన శేషు మాట్లాడుతూ పురుషోత్తపురం గ్రామ సమీపంలో ప్రైవేట్ పరిశ్రమ వైశాఖి మెరైన్ పరిశ్రమకు వెళ్లే దారిలో ప్రభుత్వానికి చెందిన పంట కాలువను అక్రమించి బాక్స్ వంతెన నిర్మాణానికి సాగు నీటి పారుదల శాఖ అధికారులు ఏవిధంగా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. వైశాఖి మెరైన్ పరిశ్రమ వ్యర్థాలు పంట కాలువ ద్వారా తాళ్లమ్మ చెరువలోకి వెళితే చెరువు ఆయకట్టులో ఉన్న 400 ఎకరాల భూముల్లోకి కలుషిత నీరు చేరుతుందని, అలాగే పరిశ్రమ వారు కాలువను ఆక్రమించడం వల్ల వరాహానది నుంచి ఖరీఫ్ పంటలకు వచ్చే సాగునీరు అందడం లేదని అన్నారు. కాలువల నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ కొరవడుతుందని ఆరోపించారు. పులపర్తి ఎంపీటీసీ సిద్దా నూకేశ్వరరావు మాట్లాడుతూ సాగు నీటి కాలువల వద్ద తలుపులు ఏర్పాటు చేయకపోవడం వల్ల పంటకు నీరు అందక వృధాగా పోతుందన్నారు. వరాహానది సమీపంలో ఇందేశమ్మ కాలువ వద్ద తలుపులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో తరుచూ విద్యుత్ కోతలు చోటు చేసుకుంటున్నాయని, విద్యుత్ అధికారులుకు దీనిపై ఎన్నిసార్లు ఫోను చేసినా పట్టించుకోవడం లేదని కృష్ణాపురం సర్పంచ్ నూకినాయుడు విద్యుత్ అధికారులను నిలదీశారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అందరికీ ఎందుకు మంజూరు కాలేదని ప్రతి గ్రామంలో అర్హత కలిగిన వారికే తాము పింఛను కోసం దరఖాస్తులు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో పెట్టామని తెలిపారు. ఇపుడు కొంత మందికి పింఛన్లు మంజూరు కావడం వల్ల ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని వైస్ ఎంపీపీ రాజాన శేషు, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, కృష్ణాపురం సర్పంచ్ వర్రె నూకినాయుడు అధికారులను ప్రశ్నించారు. కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు మాట్లాడుతూ యలమంచిలి మండలంలో ట్రిపుల్ ఐటీకి ఎన్ని పాఠశాలల నుంచి ఎంత మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో మీనాక్షిని ప్రశ్నించారు. దానికి ఆమె సమాధానం వివరంగా ఇవ్వకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన సభ్యులు ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటే అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆగ్రహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, ఎంపీడీవో అప్పలనాయుడు, ఏవో ప్రసాదరావు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్



పాల్గొన్న సభ్యులు

శివారు గ్రామాలకు సంక్షేమ ఫలాలు

నక్కపల్లి : శివారు గ్రామాల్లో కూడా సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం ఆయన సారిపల్లిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఏఏ పథకాల వల్ల ఎంత లబ్ధి పొందారనే వివరాలు తెలుసుకున్నారు. సీఎం జగన్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎం.దేవుళ్లు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహామూర్తి, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతారావు, పార్టీ సీనియర్ నాయకులు మనబాల తాతారావు, నూకతాత, అధికారులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల పుస్తకాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కోటవురట్ల : శత శాతం ఉత్తీర్ణత కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ సూచించారు. స్థానిక కేజీబీవీని ఆమె బుధవారం సందర్శించారు. పరిసరాలు, డైనింగ్ హాల్, కిచెన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి పలు పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. ఎల్ఐపీ, బీవైజేయూఎస్ ట్యాబ్స్, ఎఫ్ఏ-1 గ్రేడింగ్, నోట్‌బుక్స్ కరెక్షన్స్ పరిశీలించారు. సీ గ్రేడ్ విద్యార్థులకు ఇచ్చే రెమిడియల్ టీచింగ్ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సీ గ్రేడ్ విద్యార్థులను పర్యవేక్షించడంతో పాటు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎస్‌వో సరోజినిదేవి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

మునగపాక : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నారని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మునగపాక దళితవాడలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు అందజేసిన పలు సామాగ్రిని బుధవారం సాయంత్రం పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయన్నా రు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి రామ్మోహనరావు, అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ బుజ్జిబాబు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కాశీబాబు పాల్గొన్నారు.




పాఠశాలకు ఫ్యాన్లు,పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు

పాయకరావుపేట : మండలంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతుందని అధికారులు చర్యలు తీసుకోవాలని పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు బుధవారం వివరాలు విలేకరులకు తెలిపారు. మండలంలో ఏవిధమైన అనుమతులు లేకుండా ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లతో గ్రావెల్ అక్రమంగా రవాణా జరుగుతుందన్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్తమ్మ తల్లి పండగ నేడు



రాంబిల్లి : పెదకలవలాపల్లి గ్రామంలో గురువారం కొత్తమ్మతల్లి పండగను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యలమంచిలి కనకారావు తెలిపారు. పండగ సందర్భంగా పెదకలవలాపల్లి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అమ్మవారి ఆలయం సహా గ్రామంలో విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి స్పందన వచ్చింది. బీజేపీ జిలా ఐటీ విభాగం నాయకుడు మళ్ల కాలేశ్వరరావు ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి స్టేజిపై ఏర్పాటు చేసిన శిబిరానికి 25 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గండి సత్యనారాయణ, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు సంయుక్తంగా ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో శరగడం జగన్‌మోహన్‌రావు, యల్లపు వెంకటప్పారావు, మూర్తి, గల్లా రాజేశ్వరరావు, సర్పంచ్ జామి చినమ్మలు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



నాగులాపల్లిలో రక్తదానం చేస్తున్న దాతలు

వరి వెదజల్లుకోవడం మంచిది


నక్కపల్లి: వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు వరిని వెదజల్లు కోవడం మంచిందని వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. మండలంలో బుధవారం కాగితలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వరినారు మడులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ 5125 ఎకరాలు సాధారణ సాగుకి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో 550 ఎకరాలలో మాత్రమే నాట్లు పూర్తయ్యాయన్నారు. సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 481 ఎంఎంకి గాను 301 ఎంఎం మాత్రమే 38 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. అందుబాటులో నీరు లేక నారుమడులు ఎండిపోతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పడిన వర్షంతో వరిని వెదజల్లుకోవడం మంచిదన్నారు. దీని వల్ల నారుమడి వేసుకునే అవకాశం లేదన్నారు. కూలీల కొరత వల్ల నారుమడి కాకుండా వెదజల్లుకోవడం మంచిదని సూచించారు. విత్తనం ఒకరోజు నానబెట్టిన తర్వాత పొలంలో వెదజల్లుకోవాలన్నారు. ఈ పద్ధతిలో పిలకలు ఎక్కువగా వస్తాయన్నారు. వేర్లు బలంగా పెరుగుతాయని, చీడ పీడల బాధ తక్కువగా ఉంటుందన్నారు. వెదజల్లు పద్ధతిలో కలుపు యాజమాన్యం ముఖ్యంగా చూసుకోవాలన్నారు. విత్తిన మూడురోజులకు, ఇరవై ఐదు రోజులకు కలుపు యాజమాన్యం చేపట్టాలన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో ప్రసాద్

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సందర్శన

మునగపాక : గణపర్తి శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరమణ సందర్శించారు. గ్రంథాలయంలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయానికి వస్తున్న పాఠకుల సంఖ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంచేలా చూడాలని, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాధికారి అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.



గణపర్తి శాఖా గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

రాంబిల్లి : పర్యావరణ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని లాలంకోడూరు సర్పంచ్ లాలం రమణమూర్తి అన్నారు. ఈ గ్రామంలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించి చెట్లుగా పెరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి), ఉపాధి పథకం ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సొంత నిధులతో హైస్కూల్ మైదానం అభివృద్ధి



మైదానం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం



గతంలో ముళ్ళు, తుప్పలతో, మట్టి కుప్పలతో నిరుపయోగంగా పడి వున్న మైదానం

- మైదానం చుట్టూ వాకింగ్ ట్రాక్
- వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసరావు వితరణ

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎఎంసి వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సుమారు 3 ఎకరాల మైదానం అభివృద్ధికి నోచుకోక, నిరుపయోగంగా పడి ఉంది. ఈ మైదానంలో ముళ్ళు, తుప్పలు పెరిగిపోయి, పాములు సంచారంగా తయారైంది. ఈ మైదానాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు పొక్లెయిన్‌తో తుప్పలను తొలగించారు. గతంలో రోడ్డు కాంట్రాక్టర్ వేసిన మెటీరియల్‌ను కూడా తీయించారు. పట్టణ వాసులకు, ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారికి మైదానం చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేయిస్తున్నారు. అదే విధంగా మైదానంలో యువకులు వ్యాయామం కోసం జిమ్ పరికరాలు, విద్యార్థులు, పట్టణవాసులకు క్రీడలకు ఉపయోగపడే విధంగా బ్యాడ్మింటన్, వాలీబాల్‌కు అవసరమైన ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు.

ఎంతో కాలంగా నిరుపయోగంగా పడివున్న ఈ మైదానాన్ని అభివృద్ధి చేయడంతో పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులకు, యువకులకు, విద్యార్థులకు, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా ప్రణాళిక బద్ధంగా ఈ మైదానాన్ని అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో మెయిన్‌రోడ్డుకి ఆనుకుని ఈ మైదానం ఉన్నందున అందరికీ ఉపయోగపడుతుందని పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా దీనికి ఒక పక్కన ప్రభుత్వ జూనియర్ కళాశాల, మరో పక్కన జిల్లా పరిషత్ అతిథి గృహం, సమీపానే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండడంతో అందరికీ ఉపయోగపడే విధంగా మైదానాన్ని ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు అభివృద్ధి చేయడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

అందరికీ ఉపయోగకరం



ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మైదానం ఉంది. దీన్ని పట్టణవాసులకు, యువతకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నాను. మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్నందున అందరికీ ఉపయోగకరంగా వాకింగ్ ట్రాక్, క్రీడలకు, ఉన్నత వ్యాయామనికి ఉపయోగపడే విధంగా అభివృదింజద చేస్తున్నాను.

– గూటూరు శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్, పాయకరావుపేట

మైనర్లు వాహనాలు నడిపితే కేసులు

యలమంచిలి : మైనర్లు వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ డి.ఈశ్వరరావు అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం యలమంచిలి పట్టణంలో కొణతాల కళాశాల డిగ్రీ విద్యార్థులకు రహదారి భద్రత –ప్రమాదాల నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మైనర్లు ఎక్కువగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారని, వారు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన సంబంధిత వ్యక్తులపైనా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఆటోల్లో, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు వేలాడుతూ ప్రయాణించి, ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ విధిగా ధరించాలని, వాహనాల రికార్డులు ఉండేలా జాగ్రత్తలు పాటించాలని, జన సంచార ప్రాంతాల్లో వేగ నియంత్రణ పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. వాహనాలపై అక్రమ మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులపై దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల సలహాలు సూచనలు తీసుకుని ముందడుగు వేయాలని, కళాశాలల్లో ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రహదారి భద్రతపై విద్యార్థులకు వివరిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు

తోడపెద్దు పాలుకొలుపు పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక : మునగపాకలో సెప్టెంబర్ 2న జరిగే తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆవిష్కరించారు. బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ అందరి సహకారంతో పాలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆడారి యర్ర వెంకయ్య గారి తోడపెద్దు పాలుకొలుపు మహోత్సవంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సూరిశెట్టి కన్నారావు, ఆడారి సత్యనారాయణ, లక్ష్మణరావు, పెంటకోట జగ్గప్పారావు, వెలగా అప్పలనాయుడు, సూరిశెట్టి దుర్గునాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, వేగి కృష్ణ, వెలగా రామకృష్ణ, సూరిశెట్టి గోవింద పాల్గొన్నారు.



తోడపెద్దు పాలుకొలుపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

ఈ పంట నమోదుపై నిర్లక్ష్యం వద్దు

- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు

యలమంచిలి : రైతులు ఈ పంట నమోదు పక్కాగా నమోదు చేసుకునేలా వ్యవసాయాధికారులు చూడాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. బుధవారం మండలంలో తెరువుపల్లి గ్రామంలో పంట పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడి పంటల వివరాలు తెలుసుకొని వాటి వివరాలు ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. యలమంచిలి మండల వ్యవసాయాధికార కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న అన్ని రకాల పంటలను ఈ కర్షక్ యాప్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. యలమంచిలి డివిజన్‌లో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని, పీఎమ్ కిసాన్ పెండింగ్‌లో ఉన్న రైతులకు ఈకేవైసీ తప్పని సరిగా నమోదు చేయాలన్నారు.



ఈ పంట నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు

మరిడిమాంబ జాతరకు ఏర్పాట్లు

ఎస్.రాయవరం : కొరుప్రోలు గ్రామంలో మరిడిమాంబ జాతర పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామస్తులు ప్రత్యేకంగా అమ్మవారి ఉత్సవ కమిటీగా ఏర్పడి ప్రతి ఏడాది అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గురువారం అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమ సమర్పించి చీర సారెలు అందజేస్తారు. వమ్మవరం గ్రామంలో గురువారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



కొరుప్రోలు జాతరకు ముస్తాబైన మరిడిమాంబ